క్లుప్తంగా

పోలీసుల అనుమతి తప్పనిసరి


సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించేందుకు పోలీసు వారి ముందస్తు అనుమతి విధిగా తీసుకోవాలని సీఐ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఉపన్యాసాల్లో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించరాదని తెలిపారు. ఘర్షణలకు దారితీసే విధంగా మాట్లాడరాదని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు ఆంక్షలను ప్రతి ఒక్కరూ గౌరవించి నడుచుకోవాలని కోరారు.

వైభవంగా రథోత్సవం


ద్రౌపదీసమేత ధర్మరాజ స్వామి

నగరి : మున్సిపల్ పరిధిలోని చింతల పట్టెడలో నిర్వహిస్తున్న ద్రౌపదమ్మ తిరనాళ్లలో భాగంగా శనివారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామిని పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి రథంపై వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఊరేగింపు అనంతరం స్వామి వారిని వాహన మండపం వద్దకు చేర్చారు. రథోత్సవాన్ని ఆద్యంతం ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు. రాత్రి ఆలయం వద్ద సంగీత విభావరి నిర్వహించగా గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించారు.

వేలంలో ఆదాయం రూ.2.27 లక్షలు

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల తాత్కాలిక అంగళ్ల నిర్వహణకు నిర్వహించిన వేలంపాట ద్వారా మున్సిపాలిటీకి రూ.2,27,500 ఆదాయం వచ్చినట్లు కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నిర్వహించిన వేలంపాటలో 15 మంది పాల్గొనగా జె.పద్మనాభం హెచ్చు పాటదారుడిగా నిలిచారని వెల్లడించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం


పేదలకు అన్నదానం చేపడుతున్న దాతలు

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్కేవీబీ పేటకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు ఎం.మోహన్‌రెడ్డి శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయాలనే ఔదార్యం కలిగిన దాతలు ముందుకొచ్చి వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుని తమ దాతృత్వాన్ని చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యవంతమైన జీవితం

తిరుపతి సిటీ : చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఎస్వీయూ వీసీ రాజారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా శనివారం హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పరిపాలన భవనం నుంచి టౌన్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిరుధాన్యాల ఆవశ్యకతను, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు.సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.తులసి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ద్వారానే చిరుధాన్యాల ప్రాముఖ్యత ప్రజల్లోకి తొందరగా చేరుతుందన్నారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ విభాగాధిపతి కేవీ సుచరిత, కే అనూరాధ, బి.స్వరూపారాణి, అనిత, నీరజ, సింధూజ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమహాలక్ష్మి యాగం

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ వద్ద ఏర్పాటుచేసిన యాగశాలలో శనివారం శ్రీమహాలక్ష్మి మహాయాగాన్ని ఘనంగా నిర్వహించారు. లోకకల్యాణం, ప్రజల సుభిక్షం కోసం ఝులారియా పీఠాధిపతి ఘన్‌శ్యామాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీమహాలక్ష్మి మహాయాగం శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యాగశాలలో ఏర్పాటు చేసిన 225 కుండాల యజ్ఞాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేద పండితులు శాస్త్రోక్తంగా యజ్ఞధారణలు, వేదపారాయణం, సహస్ర నామ పారాయణం చేపట్టారు. 225 దంపతులచే శ్రీమహాలక్ష్మి, విష్ణు సహస్ర నామ పారాయణం చేయించారు. మధ్యాహ్నం 3.30 నుంచి 6 గంటల వరకు శ్రీకన్వెన్షన్ హాల్లో కైలాస్ చంద్రస్వామిజీ చేపట్టిన శ్రీమద్ భాగవత ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. మహా యజ్ఞ కో ఆర్డినేటర్ గిరిధర్ కుమార్, సంజయ్, మధుసూదన్, వేణుగోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే టీడీపీ హింసాకాండ


నగరి: నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కార్వేటినగరం : చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- పుంగనూరులో పోలీసులపై దాడి హేయనీయం
- చంద్రబాబే తన కార్యకర్తలను పోలీసుల పైకి ఉసికొల్పడం దుర్మార్గం
- వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పుట్టగతులు ఉండవు : వైఎస్సార్ సీపీ నేతలు ఫైర్
- బంద్ ప్రశాంతం

కార్వేటినగరం: ఓటమి భయంతోనే చంద్రబాబు హింసాకాండకు దిగారని, అందులో భాగంగా బందోబస్తుకు వచ్చిన పోలీసులపై దాడి చేయించారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. శుక్రవారం పుంగనూరులో చంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు సాగించిన విధ్వంసకాండను నిరసిస్తూ కార్వేటినగరం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ ఆధ్వర్యంలో శనివారం టైర్లు కాల్చి పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న చేపడుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పంలో కూడా చంద్రబాబును ఓడిస్తారనే భయంతో రౌడీమూకలతో అల్లర్లు సృష్టించి, శాంతిభద్రతలను కాపాడే పోలీసులపై రాళ్లు, బీరు సీసాలతో దాడి చేయించారని ఆరోపించారు. పక్కా ప్రణాళికతోనే చంద్రబాబుతో సహా టీడీపీ నాయకులు వాహనాల్లో తుపాకులతో వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతస్థాయి పోలీస్ అధికారులను అసమర్థులని, దుస్తులు తీసేయి అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ఈ సందర్భంగా నల్ల జెండాలతో వేణుగోపాలస్వామి ఆలయ ఆర్చ్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు చంద్రబాబు డౌన్ డౌన్, చంద్రబాబును వెంటనే అరెస్టు చేయాలనే నినాదాలతో ర్యాలీగా వెళ్లి చంద్రబాబుపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గాండ్లమిట్ట కూడలిలో టైర్లు కాల్చి రాకపోకలను ఆపి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, ధనుంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గోపీనాథ్, శేషాద్రి, శ్రీనివాసులురెడ్డి, లోకనాథ నాయుడు, గాంధీ, మునికృష్ణ, శివప్రకాష్‌మొదలి, చందురాజు, లోకనాథరెడ్డి, వెంకటేష్, మురగయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు తన కార్యకర్తలతో పోలీసులపై దాడులు చేయించడం హేయనీయమైన చర్య అని, తక్షణం చంద్రబాబుపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వేల్లూరు బాబురెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మునిరాజారెడ్డి, గోవిందరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి రక్తపాత రాజకీయాలు

నగరి : ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబువి రక్తపాత రాజకీయాలని మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. పుంగనూరులో టీడీపీ శ్రేణులు పోలీసులపైన దాడులకు పాల్పడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రశాంత జిల్లాబంద్‌లో భాగంగా నగరి మున్సిపాలిటీ, నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన నాయకులతో కలిసి టవర్‌క్లాక్ సెంటర్‌లో ధర్నా చేశారు. అక్కడి నుంచి ఓంశక్తి ఆలయం వద్ద గల బైపాస్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేశారు. బైపాస్ రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. టీడీపీ దాడులను, హింసాకాండను వ్యతిరేకిస్తూ ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ రెడ్డి చంద్రబాబు వికృత రాజకీయాలను దుయ్యబట్టారు. కుప్పంలో 39 వేలు దొంగ ఓట్లు నమోదు చేసుకుని 30 వేల ఓట్ల మెజారిటీతో గత ఎన్నికల్లో ఆయన గెలిచారన్నారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి కుప్పం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి దొంగ ఓట్లు తొలగించి మున్సిపాలిటీని, సర్పంచ్‌లను, ఎంపీటీసీలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అది తట్టుకోలేకే అదును చూసుకుని పుంగనూరు యాత్రలో చంద్రబాబు విధ్వంసాలు సృష్టించారన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలంటూ సీఐలు శ్రీనివాసంతి, రాజశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, నగరి, నిండ్ర ఎంపీపీలు భార్గవి, దీప, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మూడు మండలాలకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు, ఆర్బీకే చైర్మన్లు, మండలాధ్యక్షుడు, వైస్ ఎంపీపీలు, సచివాలయ కన్వీనర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలసముద్రం: జాతీయ రహదారిపై బైటాయించి ధర్నా చేస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: టీడీపీ అధినేత చంద్రబాబు ఓటమి తథ్యం అని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్డు ప్రధాన కూడలిలో చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు ప్రణాళిక ప్రకారం తన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉసిగొల్పి రాళ్లు, రాడ్లు, మారణాయుధాలతో పోలీసులపై దాడికి పాల్పడి 13 మందిని తీవ్రంగా గాయపరచడం, పోలీసు వాహనాలను ధ్వంసం చేయడం నీచమైన చర్య అని అన్నారు. ధర్నాలో మండల అధ్యక్షుడు మణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి పిరికిపంద చర్య

పెనుమూరు(కార్వేటినగరం): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదిరించలేక చంద్రబాబు నాయుడు తన కార్యకర్తలను పోలీసులపైకి ఉసిగొల్పడం పిరికిపంద చర్య అని మండల కన్వీనర్ విజకుమార్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పెనుమూరు ఆర్టీసీ బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు భారీఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు చేసే దౌర్జన్యాలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరని హెచ్చరించారు. పోలీసులపై దాడులు చేసి అల్లర్లు సృష్టించిన చంద్రబాబును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదా రెడ్డి, దూదిమోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, దాము, మురళి పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..


పచ్చికాపల్లంలో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం: పుంగనూరులో టీడీపీ చేసిన దాడికి నిరసనగా శనివారం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, ఏఎంసీ చైర్మన్ మునస్వామి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం..

పాలసముద్రం : ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులపై ఉసిగొల్పి దాడులకు పాల్పడడం హేయమైన చర్య అని జెడ్పీటీసీ సభ్యుడు అన్నజగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ అన్నారు. శనివారం వారు జిల్లా పార్టీ ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు రాచపాల్యం గ్రామంలో చిత్తూరు–బలిజకండ్రిగ జాతీయ రహదారిపై నాయకులు, కార్యకర్తలతో కలసి నిరసన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా చైర్మన్ పోలయ్య, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, ఎంపీటీసీలు గోవిందరాజ్ లిఖిత, ఆరుల్, శరవణన్, సుధాకర్, మురళి, షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, సుందర రాజు, చలపతి, నరసింహ నాయుడు, బాబు, మనోహర్ పాల్గొన్నారు.


పాలసముద్రం: చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గంగాధరనెల్లూరులో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వెదురుకుప్పం: నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


పెనుమూరులో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా శ్రీవారి గ్రామోత్సవం


గ్రామోత్సవంలో ప్రసన్న వేంకటేశ్వరుడు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి సంకీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరీలతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు రమణాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

ఆలయ ఆస్తుల పరిరక్షణే ధ్యేయం


మాట్లాడుతున్న ఈఓ మునికృష్ణయ్య

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ఆస్తులను పరిరక్షణే ధ్యేయంగా దేవదాయశాఖ పని చేస్తోందని ఆలయ ఈఓ ఎం.మునికృష్ణయ్య స్పష్టం చేశారు. శనివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ నాయకులు జీవరత్నంనాయుడు సదాశివేశ్వర స్వామి ఆలయ ఆవరణలో అక్రమ కట్టడాలంటూ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. త్రిలోచన పల్లవ రాజులు నిర్మించిన ఆలయం, కోనేరు దేవదాయ శాఖకు చెందిందని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 197/2లో 0.60 సెంట్లు కోనేరు స్థలం దేవదాయ శాఖ ఆధీనంలో ఉందన్నారు. గతంలో కోనేరు చుట్టూ ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, 1989లోనే ఎండోమెంట్ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 2006లో ఆక్రమణదారులను ఖాళీ చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో కోనేరు పునఃనిర్మాణం జరుగుతోందని చెప్పారు. మిగులు స్థలంలో గోవిందమాల భక్తుల సౌకర్యార్థం డార్మిటీ హాలు, ధార్మిక కార్యక్రమాల నిర్వహణ, స్వామివారి వాహనాలను భద్రపరిచే నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడ అక్రమ నిర్మాణాలు జరగడం లేదని, అవాస్తవ ఆరోపణలతో భక్తుల మనోభావాలు దెబ్బతీయవద్దని కోరారు. సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ

పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు శనివారం సర్పంచ్ గాలి మహేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి యశ్వత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ గాలి మహేష్‌బాబు మాట్లాడుతూ తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మంచి పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే శిశు మరణాలు జరగవన్నారు. అందువల్ల ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పోషకాహారాన్ని సక్రమంగా అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వారి చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రేవతి, మహిళ పోలీస్ మాలని, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, సరళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలను ధరిద్దాం


ఆర్డీవో సుజన

నగరి : స్వాతంత్ర్య సమర ఉద్యమంలో భాగంగా స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7న మొదలైందని అందుకు గౌరవ సూచికంగా అన్ని ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు, పౌరులు, రాజకీయ నాయకులు సోమవారం ''చేనేత వస్త్రాలు'' ధరించి కార్యాలయాలకు హాజరు కావాలని ఆర్డీఓ సుజన అన్నారు. ఈ మేరకు జిల్లా పాలనా అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ ఆదేశాల అనుసారం అందరూ చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. అలాగే అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం మొదలు అవుతుందని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన లోగో తయారు చేయడానికి ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించిందన్నారు. విద్యార్థిలు, పౌరులు, ఉత్సాహవంతులు లోగో తయారు చేసి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఆడుదాంఆంధ్ర.కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇలా అప్‌డేట్ చేసిన ఉత్తమ లోగోలను కమిటీ సభ్యులు పరిశీలించి చక్కటి లోగో తయారు చేసిన వారిని ఎంపిక చేసి బహుమతి ఇవ్వబడుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు సమస్య పరిష్కారం


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి

నగరి : మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్–సి లో రోడ్డు సమస్య పరిష్కారమైంది. మంత్రి ఆర్కేరోజా ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు రోడ్డు, కల్వర్టు సమస్యను ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆమె రోడ్డు, కల్వర్టుల నిర్మాణాన్ని చేపట్టాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వెంటనే ఎస్టిమేట్లు వేసుకున్న అధికారులు గడప గడపకు నిధుల ద్వారా రోడ్డు, కల్వర్టు నిర్మాణాలు ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తున్నారు. శనివారం పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో విడుదలైన గడపగడపకు నిధులు రూ.లక్ష వ్యయంతో కల్వర్టు, రూ.7.45 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. త్వరలో రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ నరేష్, ఏఈ రమేష్, నవీన్ పాల్గొన్నారు.

వేరుశనగలో సస్యరక్షణపై అవగాహన


వేరుశనగ పంటలో కలుపు నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గంగాధరనెల్లూరు: వేరుశనగ పంటలో సస్యరక్షణ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఏరువాక సమన్వయకర్త డాక్టర్ శారదజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని పాపిరెడ్డిపల్లిలో రైతులకు వేరుశనగ పంటలో కలుపు నివారణపై క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి, 4 మిల్లీల సామంత్రినిరోధిని, 19.5 శాతం థాయామిథాక్సోమ్, 19.8 మిశ్రమంతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. ప్రధాన శాస్త్రవేత రెడ్డిరాము మాట్లాడుతూ వేరుశనగలో కలుపు నివారణకు విత్తనం వేసిన వెంటనే వలోర్–32 ఎకరానికి ఒక లీటరు చొప్పున ప్రెండిమిథాలిన్ 30 శాతం, అలాగే ఇవాజిత్‌ఓఐర్ 2.1 శాతం పిచికారీ చేసిన 15–20 రోజుల వరకు కలుపును నివారించుకోవచ్చన్నారు. అలాగే విత్తిన 20 రోజుల తర్వాత గట్టి 2–4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఒక ఎకరానికి 200 మిల్లీ ఇమాజిత్‌ఫైర్ లేదా క్విజలోపాప్ ఇథైల్ 400 పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలని తెలిపారు. మామిడిలో కోత అనంతరం చేపట్టవలసిన చర్యలు, కొమ్మల కత్తరింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయకులు చక్రవర్తి, శిరీష పలువురు పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల్‌సేవ



బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అభిషేక పూజల అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. భక్తులు వీక్షించి తరించారు.